# క్రైం కౌంటర్

webisite:www.crimecounter.in ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం తెలుగు దిన పత్రిక

సంపుటి : 02 సంచిక : 148 క్రిష్ణా, ఆదివారం 22- 02 - 2026 పేజిలు : 4 వెల. 2 /-



రిపోర్టర్లు కావలెను

క్రైం కౌంటర్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో

- జిల్లా బ్యూరోలు
- జిల్లా ఇన్‌చార్జీలు
- నియోజక వర్గ ఇన్‌చార్జీలు

కావలెను.

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

98497 07349


# సీఆర్డీఏ ల్యాండ్ పూలింగ్ విధానంలో కీలక మార్పు..!



క్రైం కౌంటర్ న్యూస్, అమరావతి, ఫిబ్రవరి 21 సీఆర్డీఏ ప్రాజెక్టుల కోసం ల్యాండ్ పూలింగ్ విధానంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై ప్రాజెక్టులను నిర్వర్తించే ల్యాండ్ పూలింగ్ చర్యలు ప్రతీ జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జరుపుకోవాలని నిర్ణయించింది. సమాచారం ప్రకారం, భవిష్యత్తులో న్యాయపరమైన సమస్యలు, వివిధ రకాల చిక్కులు తలెత్తకుండా ఈ మార్పు చేసినట్లు సమాచారం. ఇప్పటికే ల్యాండ్ పూలింగ్ ద్వారా తీసుకున్న భూములకు సంబంధించిన వివాదాలను పరిష్కరించడానికి భూ యజమానులు అనేక దఫాలు కలెక్టర్ కార్యాలయానికి వెళ్తుంటారు. ఈ వ్యవహారాలను సమగ్రంగా, క్లిష్టతరం లేకుండా నిర్వహించేందుకు కలెక్టర్ బాధ్యత తప్పనిసరని సీఆర్డీఏ, ప్రభుత్వం భావిస్తోంది. ప్రస్తుత విధానం ప్రకారం, భూ యజమానులు, సీఆర్డీఏ అధికారుల మధ్య నేరుగా జరుగుతున్న లావాదేవీలు, భూ స్వాధీనం, పరిమితులు, పరిష్కారాలు కలెక్టర్ అధికారుల పర్యవేక్షణలో జరుగుతాయి. దీంతో ల్యాండ్ పూలింగ్ ప్రక్రియలో గందరగోళాలు, ప్రోసీడింగ్స్ సమస్యలు, న్యాయపరమైన సమస్యలు తక్కువగా వచ్చే అవకాశముందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వ వర్గాలు పేర్కొన్న విధంగా, ఈ మార్పు ద్వారా భవిష్యత్తులో వివాదాలను తక్కువ సమయంలో పరిష్కరించడానికి, ల్యాండ్ పూలింగ్ ప్రక్రియను సులభతరం చేయడానికి ఇది కీలకంగా మారనుందని తెలిపారు. ఇది సీఆర్డీఏ ప్రాజెక్టుల భవిష్యత్తు విధానాలను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా, భూ యజమానులకు న్యాయ పరమైన రక్షణ కల్పించే ప్రయత్నంగా కూడా చూడవచ్చని ప్రభుత్వ అధికారులు భావిస్తున్నారు.

# టెక్నాలజీని ప్రజల మేలు కోసమే వినియోగిస్తామన్న ముఖ్యమంత్రి



క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 21: ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు కాంగ్రెస్ పార్టీపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. ఢిల్లీలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సదస్సులో కాంగ్రెస్ నేతలు బట్టలు విప్పి నిరసన తెలపడం తనను తీవ్రంగా ఆవేదనకు గురిచేసిందని అన్నారు. పల్నాడు జిల్లా వినుకొండలో జరిగిన 'స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.ప్రపంచంలోని 60కి పైగా దేశాలు తమ ఆవిష్కరణలతో పాల్గొన్న అంతర్జాతీయ సదస్సులో ఇలాంటి చర్యలకు పాల్పడటం సరికాదన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు చేసిన ఈ పనులు దేశ ప్రతిష్ఠకు నష్టం కలిగిస్తాయని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. టెక్నాలజీని స్వాగతించాల్సింది పోయి, ఇలాంటి నిరసనలు చేయడం దారుణమని పేర్కొన్నారు.తాను ఇటీవల ఢిల్లీ ఏఐ సదస్సుకు హాజరయ్యానని, వైద్యం, విద్య, వ్యవసాయం వంటి రంగాల్లో టెక్నాలజీ వినూత్న మార్పులు తీసుకురాబోతోందని వివరించారు. టెక్నాలజీని ప్రజల మేలు కోసం వినియోగించడం తనకు అలవాటని స్పష్టం చేశారు. రాష్ట్రంలో టెక్నాలజీ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, విశాఖలో గూగుల్ డేటా సెంటర్, అమరావతిలో క్వాంటం కంప్యూటర్ త్వరలో అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. వ్యవసాయంలోనూ టెక్నాలజీని తీసుకొచ్చి సాగును సులభతరం చేస్తామని హామీ ఇచ్చారు.

# విమర్శలకు చెక్ పెట్టేలా,,,,హిందూపురంలో సొంతింటి నిర్మాణం

క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 21: టీడీపీ ఎమ్మెల్యే, సినీ నటుడు నందమూరి బాలకృష్ణ తన సొంత నియోజకవర్గం హిందూపురంలో ఇంటి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. హిందూపురంలోని వన్నమ్మ కాలనీలో బాలకృష్ణ సొంత ఇల్లు నిర్మించుకోనున్నారు. ఇందుకోసం శుక్రవారం శాస్త్రోక్తంగా భూమి పూజ నిర్వహించారు. సొంతింటి నిర్మాణం కోసం నిర్వహించిన భూమిపూజ కార్యక్రమంలో బాలకృష్ణ, ఆయన సతీమణి వసుంధర పూజలు నిర్వహించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడిన బాలకృష్ణ.. ఇక నుంచి తన కేరాఫ్ హిందూపురమేనని ప్రకటించారు. తన తండ్రి ఎన్టీఆర్‌ను హిందూపురం నియోజకవర్గ ప్రజలు గుండెల్లో పెట్టుకున్నారని.. మూడుసార్లు ఎమ్మెల్యేని చేయడమే కాకుండా రాష్ట్రానికి సీఎంను చేశారని అన్నారు. ఆయన వారసుడిగా తనను కూడా మూడుసార్లు శాసనసభ్యుడిగా గెలిపించారన్న బాలకృష్ణ.. అందుకే హిందూపురం ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలని ఇక్కడే సొంతిల్లు కట్టుకుంటున్నట్లు చెప్పారు. హిందూపురంలో సొంతిల్లు కట్టుకోవాలని ఎప్పటి నుంచో అనుకుంటూ ఉన్నానని.. ఇన్ని రోజులకు తన కోరిక నెరవేరుతున్నందుకు సంతోషంగా ఉందని అన్నారు. హిందూపురం నియోజకవర్ష?న్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నేతలు పాల్గొన్నారు.

అయితే హిందూపురం ఎమ్మెల్యేగా ఉన్న నందమూరి బాలకృష్ణ.. నియోజకవర్గ ప్రజలకు మాత్రం అందుబాటులో ఉండరంటూ వైసీపీ నేతలు విమర్శలు చేస్తున్నారు. ఇక్కడి ప్రజలు వరుసగా మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించినప్పటికీ బాలయ్య.. ఎన్నిసార్లు ప్రజలకు కనిపించారంటూ వైసీపీ అధికార ప్రతినిధి యాంకర్ శ్యామల కూడా ఆ మధ్య విమర్శలు చేశారు. మీటింగ్ ఉంటే వచ్చి ముఖం చూపించి పోతారని.. ఇక్కడి సమస్యలు ఆయనకు ఎలా తెలుస్తాయని ప్రశ్నించారు. సమస్యల



పరిష్కారానికి ఏం బాధ్యత తీసుకుంటారంటూ గతంలో విమర్శలు చేశారు.

మరో అడుగు ముందుకేసిన వైసీపీ ఇంఛార్జి భర్త..

యాంకర్ శ్యామల విమర్శలు ఇలా ఉంటే.. వైసీపీ హిందూపురం నియోజకవర్గం ఇంఛార్జి దీపిక భర్త వేణు రెడ్డి గతేడాది చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. మరో అడుగు ముందుకేసిన వేణు రెడ్డి.. బాలయ్యపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. హిందూపురం ప్రజలు 40 సంవత్సరాల నుంచి బానిస బతుకులు బతుకుతున్నారని.. ఎక్కడో హైదరాబాద్‌లో కూర్చున్నోడి కాళ్ల కింద బానిసలుగా మారారంటూ వేణు రెడ్డి చేసిన వ్యాఖ్యలు అప్పట్లో కలకలం రేపాయి. మనం వారికి ఓట్లేస్తే.. వారు మాత్రం హైదరాబాద్‌లో ఉంటారంటూ వేణు రెడ్డి విమర్శలు చేశారు. ఈ నేపథ్యంలో ఇలాంటి విమర్శలకు చెక్ పెట్టేలా నందమూరి బాలకృష్ణ హిందూపురంలో సొంత ఇల్లు కట్టుకుంటున్నారు.

# స్వచ్ఛ రథం.. చెత్త ఇస్తే, సరుకులు ఇస్తారు.. చంద్రబాబు



క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 21: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలో పరిశుభ్రతను పెంచేలా ప్రతి మండలంలోనూ ఓ స్వచ్ఛరథం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. పల్నాడు జిల్లా వినుకొండలో స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి.. స్వచ్ఛ రథాన్ని ప్రారంభించారు. దివ్యాంగులకు ట్రైసైకిళు పంపిణీ చేశారు. అలాగే పలు స్టాళ్లను సందర్శించారు. అనంతరం మాట్లాడిన చంద్రబాబు.. ప్రతి మండలంలోనూ స్వచ్ఛరథం ఏర్పాటుచేస్తామని ప్రకటించారు. ఆ స్వచ్ఛరథం వారానికి ఓ రోజుగ్రామాలకు వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. స్వచ్ఛరథం వచ్చిన సమయంలో ప్రజలు తమ వద్ద ఉన్న చెత్తను అందించి.. వాటికి బదులుగా నిత్యావసర సరుకులు ఉచితంగా పొందవచ్చని చంద్రబాబు ప్రకటించారు. మార్చి 31వ తేదీ నాటికి ఏపీలోని గ్రామీణ ప్రాంతాల్లో చెత్త సేకరించే బాధ్యతను ప్రభుత్వమే తీసుకుంటుందని చంద్రబాబు వివరించారు.

వైసీపీపై విమర్శలు..

మరోవైపు ప్రజావేదిక కార్యక్రమంలో మాట్లాడిన చంద్రబాబు.. గత వైసీపీ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ఏపీలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చేసరికి రాష్ట్రంలో చెత్త పేరుకుపోయిందని ఆరోపించారు. 108 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త రాష్ట్రంలో పేరుకుపోయిందన్న చంద్రబాబు.. ఆ చెత్తను తొలగించే పనిలో ఉన్నట్లు వివరించారు. అందులో భాగంగానే స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర కార్యక్రమం తీసుకువచ్చినట్లు వివరించారు. మున్సిపాలిటీలలో ప్రతి ఇంటి వద్ద చెత్త సేకరణ జరుగుతోందన్న సీఎం..మార్చి 31 నాటికి గ్రామీణ ప్రాంతాల్లోనూ ఈ పద్ధతి తెస్తామన్నారు.

సూపర్ సిక్స్.. సూపర్ హిట్.. ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను నెరవేరుస్తున్నామని చంద్రబాబు అన్నారు. పెంచిన పింఛన్ ప్రతినెలా ఒకటో తేదీనే ఇంటి వద్దనే అందిస్తున్నామన్నారు. ఎంతమంది పిల్లలు ఉన్నప్పటికీ అందరికీ తల్లికి వందనం అందిస్తున్నట్లు వివరించారు. రైతుల కోసం అన్నదాత సుఖీభవ అమలు చేస్తున్నామని.. వారి ఆదాయం పెంచేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. వ్యవసాయంలో టెక్నాలజీ వాడకం పెంచుతున్నామని.. వ్యవసాయ నిపుణులను అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నామన్న చంద్రబాబు.. పేదల కోసం పీ4 కార్యక్రమం అమలు చేస్తున్నామని వివరించారు. పేదల జీవన ప్రమాణాలు పెంచేలా ప్రభుత్వం కృషి చేస్తోందని చంద్రబాబు వివరించారు.

# సూపర్ సిక్స్ కార్యక్రమాన్ని సూపర్ హిట్ చేసి చూపించామని ఉద్ఘాటన



క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 21: సంక్షేమ పథకాల అమలులో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందని, ఏ రాష్ట్రం కూడా ఏపీకి దరిదాపుల్లో లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. పల్నాడు జిల్లా వినుకొండలో శనివారం జరిగిన 'స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర' కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. తాము ప్రకటించిన సూపర్ సిక్స్ కార్యక్రమాన్ని సూపర్ హిట్ చేసి చూపించామని, ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటామని ఆయన పునరుద్ఘాటించారు. ఈ సందర్భంగా స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఘన వ్యర్థాల సేకరణ కోసం ఏర్పాటు చేసిన 'స్వచ్ఛ రథాన్ని', ఈ–ఆటోలను జెండా ఊపి ప్రారంభించారు.ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని చంద్రబాబు అన్నారు.దేశంలో ఏ రాష్ట్రమూ ఏపీకి దరిదాపుల్లో లేనంత సంక్షేమాన్ని అందిస్తున్నాం. మొదటి తారీఖునే పేదల సేవలో భాగంగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో స్వయంగా పాల్గొంటున్నాను. 'తల్లికి వందనం' ద్వారా ఇంట్లో ఎంతమంది పిల్లలున్నా ఆర్థిక సాయం అందిస్తున్నాం.అన్నదాత సుఖీభవ' కింద రైతులకు మూడు విడతల్లో రూ.20 వేల ఆర్థిక సాయం అందిస్తున్నాం అని వివరించారు.మహిళల అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి తెలిపారు. "స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలందరికీ ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నాం. వారు ఈ పథకాన్ని చక్కగా వినియోగించుకుంటున్నందుకు చాలా సంతోషంగా ఉంది. లక్ష మంది మహిళలను ఎంఎస్ఎంఈలుగా తీర్చిదిద్దుతున్నాం" అని పేర్కొన్నారు. పీ4 కార్యక్రమం కింద ఇప్పటివరకు 10 లక్షల కుటుంబాలను దత్తత తీసుకున్నామని, వారికి మార్గనిర్దేశం చేసేందుకు లక్ష మంది మార్గదర్శులు ముందుకు వచ్చారని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా 561 స్వయం సహాయక సంఘాలకు రూ.100.14 కోట్ల చెక్కును అందించారు.పౌర సేవల్లో టెక్నాలజీ వినియోగానికి పెద్దపీట వేస్తున్నామని చంద్రబాబు చెప్పారు. "దేశంలో ఏ రాష్ట్రం కూడా వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా సేవలు అందించడం లేదు. త్వరలో విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)లో శిక్షణ ఇచ్చేందుకు ఏఐ ట్యూటర్‌ను తీసుకువస్తున్నాం. ఇటీవల బిల్ గేట్స్ కూడా రాష్ట్రానికి వచ్చి రైతులు టెక్నాలజీని వినియోగిస్తున్న తీరును చూసి ఆనందం వ్యక్తం చేశారు" అని గుర్తుచేశారు. విశాఖలో గూగుల్ డేటా సెంటర్, అమరావతిలో క్వాంటం కంప్యూటర్ ఏర్పాటు కానున్నాయని వెల్లడించారు. ప్రజల ఆరోగ్యం కోసం యూనివర్సల్ హెల్త్ పాలసీ తీసుకువస్తున్నామని, పేద కుటుంబాలకు ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టు ద్వారా రూ.25 లక్షల వరకు చికిత్స ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందని హామీ ఇచ్చారు. వ్యవసాయంలోనూ టెక్నాలజీని ప్రవేశపెట్టి సాగును సులభతరం చేస్తామన్నారు. రైతులు పండించే పంటలకు మార్కెట్ ధర అందేలా, సాగునీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. వినుకొండను హార్టికల్చర్

2 లో

## సూపర్ సిక్స్ కార్యక్రమాన్ని సూపర్ హిట్ చేసి చూపించామని ఉద్ఘాటన

హబ్‌గా తీర్చిదిద్దే ఆలోచన ఉందన్నారు.స్వచ్ఛమైన వాతావరణం కల్పించడమే 'స్వచ్ఛాంధ్ర' లక్ష్యమని సీఎం అన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారాయణ నేతృత్వంలో ఈ కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ముమ్మరంగా సాగుతోందన్నారు. "గత పాలకులు వదిలేసిన 108 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను తొలగించే బృహత్తర కార్యక్రమం చేపట్టాం. మార్చి నాటికల్లా గ్రామీణ ప్రాంతాల్లో వందశాతం డోర్ టు డోర్ చెత్త సేకరణ పూర్తి చేస్తాం" అని ఆదేశించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించామని, దీనివల్ల పశువులు, ప్రజల ఆరోగ్యం దెబ్బతింటోందని వివరించారు.చెత్తను సంపదగా మార్చే ప్రక్రియను ప్రోత్సహిస్తున్నామని చంద్రబాబు తెలిపారు. "విశాఖ, గుంటూరులలో చెత్త నుంచి విద్యుత్ తయారు చేసే ప్లాంట్లు ఉన్నాయి. రాజమండ్రితో పాటు మరో 5 ప్లాంట్లు త్వరలో ఏర్పాటు చేస్తాం. రాష్ట్రంలో 4 లక్షలకు పైగా కుటుంబాలు హోం కంపోస్టింగ్ ద్వారా ఎరువు తయారు చేసుకుంటున్నాయి" అని ప్రశంసించారు. చెత్త నిర్వహణలో జపాన్ పౌరుల తరహాలో మన ఆలోచనా తీరు మారాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నారాయణ, గొట్టిపాటి రవికుమార్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభిరామ్, కలెక్టర్ కృతికా శుక్లా తదితరులు పాల్గొన్నారు.

## సభ్యుల గౌరవ వేతనాల చెల్లింపు పై నిర్లక్ష్యత తగదన్న-ఎం.పీ.పీ.



**ఏలూరు జిల్లా ముదినేపల్లి:::: క్రైం కౌంటర్ న్యూస్ ప్రతినిధి:::** సభ్యుల గౌరవ వేతనాల చెల్లింపు పై నిర్లక్ష్యత తగదన్న-ఎం.పీ.పీ. రామిశెట్టి ఈ రోజు మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఎం.పీ.టీ.సీ. సభ్యుల గౌరవ వేతనాల చెల్లింపు పై ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి తగదని ఎం.పీ.పీ. రామిశెట్టి సత్యనారాయణ అన్నారు. ముదినేపల్లి మండలం సర్వసభ్య సమావేశపు సభలో ఎం.పీ.టీ.సీ.లు ప్ల కార్డులతో తమకు రావలసిన గౌరవ వేతనం వెంటనే చెల్లించాలని నినాదించారు. ఈ సందర్భంగా ఎం.పీ.పీ. మాట్లాడుతూ ఎమ్మెల్యేలకు నెలకు లక్ష పైనే వేతనాలు చెల్లిస్తున్న ప్రభుత్వం ఎం.పీ.టీ.సీ.లకు నెలకు 3వేలు చొప్పున ప్రకటించి ఇప్పటికీ ఇవ్వకుండా జాగుచేస్తున్నదున ఒక్కొక్కరికి లక్ష రూపాయిలు బకాయిలున్నాయని, ప్రజా ప్రతినిధులకు గౌరవ వేతనాలు వెంటనే చెల్లించి ఆదుకోవాలన్నారు.ఈ కార్యక్రమం లో ఎం.పీ.పీ , ఎం.పీ.టీ.సీ , జడ్పి.టి.సి , సర్పంచులను శాలువాలు, పూదండలతో ఎం.పీ.డీ.వో. వై రామకృష్ణ , డిప్యూటీ ఎం.పీ.డీ.వో. బి అశోక్ లు ఘనంగా సత్కరించారు. ఏ.ఓ. బి. వేణుమాధవ్ , పి.హెచ్.సీ. వైద్యులు , ఇరిగేషన్ తదితర శాఖల నివేదికలను సభ్యులకు వివరించారు. గత ఐదు ఏళ్లుగా సర్పంచులు , ఎం.పీ.టీ.సీ.లు , అధికారులు అందరి సహకారంతోనే మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించగలిగానని ఎం.పీ.పీ.ప్రతి ఒక్కరికి పేరు,పేరునా కృతజ్ఞతలు తెలిపారు.సభ ఆరంభంలో మృతి చెందిన ఎం.పీ.డీ.వో. కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ మల్లంపల్లి వెంకట సుబ్బారావు , ఉపాధి హామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణలకు సభ్యులు రెండు నిమిషాలు మౌనం పాటించారు

## అంగరంగ వైభవముగా పెద్దింట్లమ్మ తల్లి దర్శనం



**ఏలూరు జిల్లా కైకలూరు:::క్రైం కౌంటర్ న్యూస్ ప్రతినిధి::::** అంగరంగ వైభవముగా పెద్దింట్లమ్మ తల్లి దర్శనం కైకలూరు నియోజకవర్గం కొల్లేటి కోట పెద్దింట్లమ్మ తల్లి జాతర ఎంతో వైభవముగా నిర్వహిస్తూ,ఆలయంనకు వచ్చే భక్తులకు,మొక్కుబడులు,పాల పొంగళ్ళు పెట్టుకునేందుకు వీలుగా ఆలయ ప్రాంగణంలో వారికి ప్రత్యేకముగా చలువ పందిళ్ళలో వండుకొనేందుకు వీలు కల్పించామని, అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా అన్ని శాఖల అధికారులు పర్యావేక్షిస్తున్నారని, ప్రతిరోజూ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, దర్శనానికి వచ్చే ప్రజలందరికి అమ్మవారి ఆశీస్సులుని వేదపండితులు,వేదమంత్రాలతో అందిస్తున్నారని,అమ్మవారికి నీవేదన చేసిన ప్రసాదం ని భక్తులకు పంచిపెడుతున్నామని ఆలయ కార్యనిర్వహణాధికారి కూచిపూడి శ్రీనివాస్ తెలియచేసారు

## అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అని ముదినేపల్లి మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరచాలన్నదే తన సంకల్పమన్న రామిశెట్టి సత్యనారాయణ.



**ఏలూరు జిల్లా ముదినేపల్లి::::క్రైం కౌంటర్ న్యూస్ ప్రతినిధి::::** అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అని ముదినేపల్లి మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరచాలన్నదే తన సంకల్పమన్న రామిశెట్టి సత్యనారాయణ.ఈ మధ్యాహ్నం ముదినేపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశపు మందిరంలో మండల పరిషత్ అధ్యక్షులు రామిశెట్టి సత్యనారాయణ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది.ముందుగా మండల పరిషత్ కార్యాలయం లో.. విధులు నిర్వహిస్తున్న ఏం.వి. సుబ్బారావు మరియు, యెన్.అర్.జీ.ఎస్. టీ.ఏ. లక్ష్మీనారాయణ .. ఇటీవలే మరణించగా. సభతరపున సంతాపం తెలియజేశారు అనంతరం ఆయా శాఖల అధికారులు తమ,తమ శాఖల ద్వారా మండల అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి అందిస్తున్న సేవలను వివరించారు.ఎం.పీ.పీ. సత్యనారాయణ మాట్లాడుతూ.. గ్రామాల్లోని ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రజా ప్రతినిధులతో పాటు అధికారులు దృష్టి సారించి మెరుగైన సేవలందించాలన్నారు.ఎంపీటీసీ సభ్యులకు ప్రభుత్వం ఇచ్చే గౌరవ వేతనం ఎంపీటీసీ సభ్యుడికి నెలకు రూ. 3 వేల చొప్పున గౌరవ వేతనం ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేయాలని ఎంపీటీసీ సభ్యులు డిమాండ్ చేశారు....రానున్న వేసవికాలాన్ని దృష్టిలో పెట్టుకుని తాగునీటి సరఫరా విషయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని.. అన్ని గ్రామ పంచాయతీలలో పంచాయతీ నీటి ట్యాంకులలో బ్లీచింగ్ పౌడర్ (కాల్షియం హైపోక్లోరైట్) కలపడం ద్వారా నీటిలోని హానికరమైనబ్యాక్టీరియా, వైరస్‌లను చంపి నీటిని శుద్ధి చేయవచ్చు అని అన్నారు.. పంచాయతీ కార్యదర్శులు తప్పనిసరిగా బ్లీచింగ్ చేయాలని ఆదేశించారు. అన్ని గ్రామాల సర్పంచులకు మండల పరిషత్ సర్వసభ సమావేశం ఇదే ఆఖరి సమావేశం ఈ సందర్భంగా సర్పంచుల అందరికి ఎం.పీ.పీ. సత్యనారాయణ, జడ్పి.టీ.సీ. సభ్యులు ఈడే వెంకటేశరమ్మ .. అన్ని గ్రామాల ఎం.పి.టి.సి.లు కలిసి గౌరవ సర్పంచుల అందరికీ సన్మానం చేసి ఘన వీడ్కోలు పలికారు... ఇప్పటివరకు అన్ని గ్రామాలకు మండల పరిషత్ నిధులు కేటాయించి సహకరించినందుకు సర్పంచ్లందరూ ఎం.పీ.పీ. సత్యనారాయణని ఘనంగా సత్కరించి ధన్యవాదాలు తెలిపారు...అలాగే ఈ ఏడాది పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ముదినేపల్లి మండలం మొదటి స్థానంలో ఉండేలాగా చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారులు కృషి చేయాలన్నారు ఈ కార్యక్రమం లో... జడ్పీటీసీ సభ్యురాలు ఈడే వెంకటేశరమ్మ, మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యులు షేక్ అల్లాబక్షు,ఎం.పీ.డీ.ఓ.వై. రామకృష్ణ, డిప్యూటీ ఎం.పీ.డీ.ఓ..అశోక్, అన్ని గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు

## ఎవరు చెబితే కిడ్నాప్ చేశారు?

**పోలీస్ కస్టడీలో ఎంబీయూ పీఆర్వో, మరో ఇద్దరికి ప్రశ్నలు**

**తిరుపతి కోర్టు అనుమతితో ఐదు రోజుల పోలీస్ కస్టడీకి**



**క్రైం కౌంటర్ న్యూస్,** తిరుచానూరు, ఫిబ్రవరి 21 విద్యార్థి నేతల కిడ్నాప్ కేసులో మోహన్‌బాబు యూనివర్సిటీ (ఎంబీయూ) పీఆర్వో సతీశ్ (ఏ1), క్రమశిక్షణ విభాగం ఇన్‌చార్జి మునిచంద్ర (ఏ12), వాహనాల ఇన్‌చార్జి వాసు(ఏ17)ను ఐదు రోజుల పోలీసు కస్టడీకి ఇస్తూ తిరుపతి న్యాయస్థానం శనివారం ఉత్తరులిచ్చింది. ఆమేరకు ఈ ముగ్గురినీ ఏఎస్పీ రవిమనోహరాచారి ఆధ్వర్యంలో చంద్రగిరి డీఎస్పీ ప్రసాద్, సీఐ సునీల్‌కుమార్ బృందం కస్టడీకి తీసుకుని విచారిస్తున్నారు. ధర్నా చేయడానికి వెళుతున్న విద్యార్థి సంఘం నేతలను ఎందుకు కిడ్నాప్ చేశారు? ఎవరుచెబితే ఈ పనిచేశారు? అసలు మీ ఉద్దేశం ఏమిటి..? అనే ప్రశ్నలు వేసి నిందితుల నుంచి సమాధానాలు రాబట్టినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా.. ఇదే కేసులో ఏ3గా ఉన్న మంచు విష్ణుకు నోటీసులు ఇచ్చినా.. ఇంతవరకు విచారణకు హాజరు కాలేదని సీఐ సునీల్‌కుమార్ తెలిపారు. తిరుపతి కలెక్టరేట్ వద్ద ధర్నా చేయడానికి వెళుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అలీ అక్బర్, ఉపాధ్యక్షుడు వినోద్‌ను తిరుచానూరు వద్ద కిడ్నాప్ చేసిన వ్యవహారంలో ఎంబీయూ పీఆర్వో సతీశ్, మోహన్‌బాబు, మంచు విష్ణుతో పాటు మరో 20మందిపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదుచేశారు. కాగా, ఏ2 మోహన్‌బాబుకు అరెస్టు నుంచి రక్షణ కల్పించేందుకు ఈ నెల 17న జరిగిన విచారణలో హైకోర్టు నిరాకరించింది. తదుపరి విచారణ మార్చి 3న జరగనుంది.

## తిరుమల పవిత్రత దెబ్బతీసే హక్కు వైసీపీ వాళ్లకు ఎవరిచ్చారు?

**చెప్పులేసుకుని స్వామి ఫొటోను సభలోకి తెచ్చి విసిరికొడతారా?**

**అధికారంలో ఉన్నా, విపక్షంలో**

**ఉన్నా బూతులు తిడుతున్నారు**

**ఆంబోతుల్లా ప్రవర్తిస్తున్నారు**

**బూతులు తిట్టేవారికి పరామర్శలు**

**వైసీపీ వాహనాల కింద నలిగేవారిని మాత్రం పట్టించుకోరా?**

**పల్నాడు జిల్లా వినుకొండ పర్యటనలో సీఎం చంద్రబాబు తీవ్ర ఆగ్రహం**

**గ్రామాల్లో 100శాతం చెత్త సేకరణ**

**వృత్తాకార ఆర్థిక వ్యవస్థను పునర్నిర్వచిస్తున్నాం: సీఎం**




గుంటూరు(వినుకొండ), ఫిబ్రవరి 21 తిరుమలలో నాడు నాసిరకం ప్రసాదాలను భక్తులకు పంచిపెట్టారని, ఇప్పుడేమో తాము చేసిన తప్పును వైసీపీ నేతలు వేరే వాళ్లపైకి నెట్టేసే నీచానికి పాల్పడుతున్నారని సీఎం చంద్రబాబు ఆగ్రహించారు. వేంకటేశ్వర స్వామిపై భక్తులకు ఉన్న నమ్మకాన్ని, పవిత్రతను దెబ్బతీసే అధికారం వీళ్లకు ఎవరిచ్చారని ప్రశ్నించారు. ""సాక్ష్యాత్తు వేంకటేశ్వరస్వామి ఫొటోను కౌన్సిల్‌లోకి తీసుకెళ్లారంటే వీళ్లని ఏమనాలి? చెప్పులేసుకొని ఫొటోలు తీసుకొని వచ్చి వాటిని విసిరి పారేశారు. తమ రాజకీయ పార్టీ ఉందన్న అహంకారమే దీనంతటికి కారణం." అని మండిపడ్డారు. శనివారం స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొనేందుకు సీఎం చంద్రబాబు పల్నాడు జిల్లా వినుకొండ పట్టణానికి వచ్చారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. "మేం అధికారం చేపట్టగానే తిరుమల ప్రక్షాళనకు శ్రీకారం చుట్టి కొత్త ఈవోను నియమించాం. నెయ్యిలో కల్తీ ఉందని అప్పుడే తేలింది. ఆ శాంపిల్‌ను ఎన్‌డీడీబీకి పంపిస్తే అందులో జంతుకొవ్వు ఉందని నివేదిక వచ్చింది. అదే విషయం నేను చెప్పాను. వైసీపీ వాళ్లు లేనిపోనివి సృష్టించి సుప్రీంకు వెళితే సిట్‌ను ఏర్పాటు చేసింది. సిట్ నివేదికలో లడ్డూ తయారీలో వినియోగించినది నెయ్యే కాదని చెప్పింది. దీనిపై చర్యలు తీసుకోమని ప్రభుత్వానికి సూచించింది." అని తెలిపారు. ఇంకా ఆయన ఏమన్నారంటే..

రాజకీయ ప్రక్షాళనకు ప్రజలు కలిసిరావాలి

"శివుడి తలపై పాము ఉంటే, అది ఎక్కడ కాటు వేస్తుందోనని అంతా భయపడతారు. నేను శివుడి తలపై పాము ఉంటే, ఆయనకు నమస్కారం పెట్టి, పామును బయటకు తీసుకొచ్చి ఏమి చేయాలో అది చేస్తాను. ప్రజలు కూడా తమకెందుకని కూర్చోకుండా ముందుకొచ్చి వైసీపీ లాంటి చెడు పార్టీలను నిరాకరిస్తే రాజకీయాలు ప్రక్షాళన అవుతాయి. వైసీపీ వాళ్లు అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా బూతులు తిడుతున్నారు. నేను ప్రతిపక్షంలో ఉండగా, నా భార్యను దూషించారు. ఆంబోతుల మాదిరిగా ప్రవర్తిస్తూ రెచ్చగొడుతున్నారు. రాష్ట్రాన్ని గంజాయితో సర్వనాశనం చేశారు."

బాలికల రేపిస్టులను హెచ్చరిస్తున్నా..

"గంజాయి సేవించి మదనపల్లెలో ఒక వ్యక్తి మృగంలా మారి ఏడేళ్ల చిన్నారిపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. నేను ఒకటే చెబుతున్నా. ఆడబిడ్డల జోలికొస్తే అదే వాళ్లకు చివరి రోజు. ఆ మాటకు కట్టుబడి ఉన్నాను. మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడే వాళ్లకు ఈ సమాజంలో చోటు లేదు. వాళ్లకి ఉరిశిక్ష పడాలి."

బూతులు తిట్టేవారికి పరామర్శలా?

" 2019 ఎన్నిలకు ముందు మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యను తొలుత గుండెపోటుగా చిత్రీకరించారు. ఆయన కుమార్తె విజ్ఞప్తి మేరకు పోస్టుమార్టం చేస్తే అది హత్య అని తేలింది. దీంతో వాళ్లు నాటకాలు మార్చి మరుసటి రోజు ఉదయం వాళ్ల పత్రికలో 'నారాసుర రక్తచరిత్ర' అని రాశారు. నేను రాజకీయం చేస్తాను. రౌడీల గుండెల్లో రైళ్లు పరుగెట్టిస్తా. సంఘ విద్రోహ శక్తులను అణచివేస్తాను తప్పించి నేరాలు చెయ్యను. ఇప్పుడు కల్తీ నెయ్యి వ్యవహారంలోకి హెరిటేజ్‌ను తీసుకొచ్చి నాపై తప్పు వేయాలని చూస్తున్నారు. ఇలాంటి కరుడుగట్టిన నేరస్తులతో రాజకీయం చేయాల్సి రావడం బాధాకరం. 'వైసీపీ నేత జగన్ బయటకు వస్తే బలవంతంగా మనుషులను తీసుకొస్తారు. పోతూపోతూ వాళ్ల కార్ల కిందనే అమాయక మనుషులను చంపేస్తారు. ఆ తర్వాత వాళ్లను ఏమాత్రం పట్టించుకోరు. బూతులు తిట్టిన వాళ్లను మాత్రం ఇళ్లకు వెళ్లి పరామర్శిస్తారు. వాళ్ల కోసం వచ్చి చనిపోయిన వాళ్లకు ఎలాంటి పరామర్శలు ఉండవు. దీనిని బట్టి ఆ పార్టీ నాయకుల వైఖరిపై ప్రజలే ఆలోచన చేయాలి." కాంగ్రెస్ వైఖరి గర్హనీయం.. "ఢిల్లీలోని ఏఐ సదస్సుకు అన్ని దేశాల నుంచి ప్రతినిధులు వచ్చి వాళ్లు చేసిన ఆవిష్కరణలను ప్రదర్శించారు. ఆ సదస్సు దేశానికి ఎంతగానో ఉపయోగపడుతుంది. దీనిని స్వాగతించాల్సిందిపోయి కాంగ్రెస్ పార్టీ వాళ్లు అర్ధనగ్నంగా సదస్సులోకి ప్రవేశిస్తారా? వాళ్లను ఏమనాలో. బాధ్యత లేకుండా ప్రవర్తించిన కాంగ్రెస్ తీరును తీవ్రంగా గర్హిస్తున్నాను."

# నాటి సీఎం అభీష్టం మేరకే

**బేవరేజెస్ కార్పొరేషన్ ఎండీగా వాసుదేవరెడ్డి**
**రైల్వేస్ నుంచి డిప్యుటేషన్‌పై ఏపీ సర్వీసుకు**
**నాటి సీఎం ప్రిన్సిపల్ అడ్వైజర్ లేఖలే ఆధారం**
**పక్కా ప్రణాళిక, ముందస్తు కుట్రతోనే: సిట్**
**3,500 కోట్ల లిక్కర్ కుంభకోణంలో**
**ప్రధాన కుట్రదారు, పాత్రధారి ఆయనే**
**లిక్కర్ సిండికేట్ ఏర్పాటులో కీలక పాత్ర**
**యంత్రాంగాన్ని పణంగా పెట్టి ఆదాయానికి గండి**
**సిండికేట్‌కు వేల కోట్ల ముడుపులు**
**ఇండెంట్, సరఫరా, అమ్మకాలు అంతా ఆఫ్‌లైన్‌లో**
**వాసుదేవరెడ్డి రిమాండ్ రిపోర్టులో కీలకాంశాలు**



**క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 21:** గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన మద్యం కుంభకోణంలో ఏ–2గా ఉన్న వాసుదేవరెడ్డిని రాష్ట్రానికి తీసుకొచ్చిందెవరు? ఎక్కడో రైల్వే ట్రాఫిక్ సర్వీసులో పనిచేస్తున్న ఆయన్ను ఏపీకి డిప్యుటేషన్‌పై తీసుకురావాలని సిఫారసు చేసిందెవరు? వాసుదేవరెడ్డిని రాష్ట్ర సర్వీసుకు తీసుకొచ్చాక ఏరికోరి ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ ఎండీగా నియమించాలని చెప్పిందెవరు? ఈ ప్రశ్నలకు వేళ్లన్నీ నాటి ముఖ్యమంత్రి జగన్‌వైపే చూపిస్తున్నాయి. నాటి ముఖ్యమంత్రి కోరిక మేరకే వాసుదేవరెడ్డిని రైల్వే సర్వీసు నుంచి ఏపీకి డిప్యుటేషన్‌పై తీసుకొచ్చారని సిట్ విచారణలో తేలింది. ముఖ్యమంత్రి అభీష్టం మేరకే బేవ రేజెస్ కార్పొరేషన్‌కు ఎండీగా, ఆ తర్వాత డిస్టిలరీస్ కమిషనర్‌గా నియమించారని, ఇందుకు ఆయన ప్రిన్సిపల్ అడ్వైజర్ రాసిన లేఖలే ఆధారాలని సిట్ తేల్చింది. లిక్కర్ స్కామ్‌లో ఏ–2గా ఉన్న వాసుదేవరెడ్డిని శనివారం సిట్ అరెస్ట్ చేసింది. ప్రభుత్వం ఇచ్చిన పోస్టుల్లో చేరిన తర్వాత వాసుదేవరెడ్డి.. జగన్ సన్నిహితులైన రాజ్‌కసిరెడ్డి, మి?థున్ రెడ్డి, విజయసాయిరెడ్డి ఇతరులతో కలిసి మద్యం కుంభకోణం చేసేందుకు వ్యూహ రచన చేశారని, ఆ కుట్రకు సూత్రధారిగా, పాత్రధారిగా వ్యవహరించారని ఆయనపై తీవ్ర అభియోగాలు నమోదు చేసింది. వాసుదేవరెడ్డిని సిట్ అరెస్ట్ చేసిన సందర్భంగా కోర్టుకు రిమాండ్ రిపోర్టును సమర్పించింది. అందులో పలు కీలక అంశాలను ప్రస్తావించింది.

అజేయకల్లం సిఫారసు లేఖలు

'ముఖ్యమంత్రి అభీష్టం మేరకు రైల్వేలో ఉన్న వాసుదేవరెడ్డిని ఏపీకి డిప్యుటేషన్‌పై తీసుకురావాలి' అని ఒకసారి, 'ఆయన్ను బేవరేజెస్ కార్పొరేషన్ ఎండీగా నియమించాలి' అని మరోసారి ప్రిన్సిపల్ అడ్వైజర్.. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎ?స)కి నోట్స్ పంపించారు. సత్యప్రసాద్ (ఏ3)ను కూడా సీఎం అభీష్టం మేరకే బేవరే జెస్ కార్పొరేషన్‌లో స్పెషల్ ఆఫీసర్‌గా నియమించాలని ప్రిన్సిపల్ అడ్వైజర్ సీఎ?సకు నోట్ పంపించారు. ఈ విషయాన్ని సిట్ పేర్కొంది. ముఖ్యమంత్రి అభీష్టం మేరకు అన్నాక సీఎస్ కేంద్రం, రైల్వే శాఖ పెద్దలను సంప్రదించి వాసుదేవరెడ్డిని ఏపీకి డిప్యుటేషన్‌పై తీసుకొచ్చారు. సీఎం అభీష్టాన్ని బయటపెట్టిన ఆ ప్రిన్సిపల్ అడ్వైజర్ ఎవరంటే.. రిటైర్డ్ ఐఏఎస్ అజేయకల్లం రెడ్డి. రిమాండ్ రిపోర్టులో నాటి ముఖ్యమంత్రి జగన్, ఆయన ప్రిన్సిపల్ అడ్వైజర్ అజేయకల్లంరెడ్డి పేర్లు ప్రస్తావించలేదు. కానీ నాటి ముఖ్యమంత్రి అంటే జగనే. ముఖ్యమంత్రికి ప్రిన్సిపల్ అడ్వైజర్‌గా పనిచేసింది అజేయకల్లంరెడ్డినే. తొలుత వాసుదేవరెడ్డిని రైల్వేస్ నుంచి ఏపీ సర్వీసుకు తీసుకొచ్చాక తాగునీటి సరఫరా కార్పొరేషన్ ఎండీగా నియమించాలని నాటి సీఎస్ భావించారు. కానీ కేవలం పది రోజుల వ్యవధిలోనే నిర్ణయం మార్చుకొని బేవరేజెస్ కార్పొరేషన్ ఎండీగా నియమిస్తూ 2019 సెప్టెంబరు 16న సీఎస్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆ తర్వాత మరో 15 రోజులకే ఆయన్ను డిస్టిలరీస్ కమిషనర్‌గా నియమిస్తూ మరో ఉత్తర్వు ఇచ్చారు. "ముందస్తు కుట్ర, పక్కా ప్రణాళిక వేసుకున్నాకే వాసుదేవ రెడ్డిని డిప్యుటేషన్‌పై ఏపీకి తీసుకొచ్చారు. ఆయన్ను విచారిస్తేనే కుట్రలో భాగస్వాములైన వారు, వారి చర్యలను మరింతగా నిగ్గు తేల్చాల్సి ఉంది" అని సిట్ పేర్కొంది.

బహుముఖ పాత్రవాసుదేవరెడ్డి బేవరేజెస్ కార్పొరేషన్ ఎండీగా వచ్చాక లిక్కర్ దందాలో ఆయనదే కీలక పాత్ర. లిక్కర్ దందా నడిపించేందుకు రాజ్‌కసిరెడ్డి(ఏ1), మిథున్‌రెడ్డి (ఏ4), విజయసాయిరెడ్డి (ఏ5), సజ్జల శ్రీధర్‌రెడ్డి (ఏ6), ముప్పిడి అవినాశ్‌రెడ్డి (ఏ7) తదిత రులతో సమావేశాలు నిర్వహించడం, కుట్రకు వ్యూహరచన చేయడం, ఆ తర్వాత దోపిడీ కుట్రను అమలు చేయడంలో కీలకపాత్ర పోషించారని సిట్ పేర్కొంది. వాసుదేవరెడ్డి ఎండీగా వచ్చాక లిక్కర్ దందా కుట్రదారులైన రాజ్‌కసిరెడ్డి, మరికొందరి సూచనల మేరకు ఇండెంటింగ్ విధానం మార్చారు. ఆన్‌లైన్ విధానం తొలగించి దాని స్థానంలో మాన్యువల్ విధానం తీసుకొచ్చారు. దీంతో సరఫరాలో పారదర్శకత లోపించింది. దాన్ని అడ్డం పెట్టుకొని చిల్లర బ్రాండ్లు తెరమీదకు వచ్చాయి. కేవలం నోటి మాటలతోనే వాసుదేవరెడ్డి బేవరేజెస్ కార్పొరేషన్‌లో పాలనా, అమ్మకం, సరఫరా, ఇతర విధానాలను మార్చేశారు. మద్యం సరఫరాలో కీలకమైన సీఏటెల్ సాఫ్ట్‌వేర్‌ను తొక్కిపెట్టారు. దీనివల్ల మద్యం మాఫియా సూచించిన బ్రాండ్లనే రిటైల్ దుకాణాలకు సరఫరా చేసేలా మాన్యువల్ విధానం తీసుకొచ్చారు. రాజ్‌కసిరెడ్డి, ఆయన అనుచరులు సుమిత్, ప్రకాశ్‌ల నుంచి వచ్చే ఆదేశాలను తు.చ. తప్పకుండా పాటించాలని అధికార యంత్రాంగాన్ని శాసించారు. మద్యం అమ్మకాలు, సరఫరా, డిమాండ్, చెల్లింపులకు సంబంధించిన డేటాను సిండికేట్‌లకు చేరవేశారు. ప్రముఖ బ్రాండ్లు రిటైల్ దుకాణాలకు వె ళ్లకుండా, చిల్లర బ్రాండ్లు దుకాణాలకు చేరడంలో వాసుదేవరెడ్డిది కీలకపాత్ర. సిండికేట్‌లకు ఏ బ్రాండ్ నుంచి ఎంత ముడుపులు చెల్లించాల్నో ఆయనే సమాచారం ఇచ్చేవారు. ఒక్కో బీర్ కేసుపై తొలుత 12 శాతం, ఆ తర్వాత 20 శాతం ముడుపులు ముట్టచెప్పాలన్నారు. సిండికేట్‌కు తలొంచకపోతే సరఫరా ఆర్డర్లు నిలిపివేస్తామని బెదిరించారు.

సిండికేట్ అడ్డాగా కార్పొరేషన్‌వాసుదేవరెడ్డి చర్యల వల్ల సిండికేట్‌కు నెలకు కనీసం 50–60 కోట్ల ముడుపులు చేరాయి. వాసుదేవరెడ్డికి తెలిసే 3,500 కోట్ల లిక్కర్ దందా జరిగింది. ఇందులో ఎవరెవరి పాత్ర ఏమిటో? ఎవరి వాటాలు ఏమిటో? ఆయనకు తెలుసు. హవాలా మార్గంలో నిధుల మళ్లింపు, వసూళ్లు, ఇంకా అక్రమ సొమ్మును విదేశాలకు తరలించడం, అక్కడ వినియోగించడం వంటి కీలక విషయాలు ఆయనకు తెలిసే జరిగాయి. కానీ ఆ వివరాలపై ఆయన పెదవి విప్పడం లేదు. అంతిమంగా డబ్బు ఎక్కడికి చేరిందన్న విషయాలు వాసుదేవరెడ్డికి బాగా తెలుసు. మద్యం కుంభకోణంలో వెలుగులోకి రాని అనేక కోణాలు వాసుదేవరెడ్డికి తెలుసు. ఈ దందాలో వసూలు చేసిన బ్లాక్‌మనీని వైట్‌మనీగా ఎలా మార్చారు? అక్రమ పద్ధతుల్లో డబ్బును ఎలా దారి మళ్లించారు? సిండికేట్ ఆ డబ్బుతో ఏం చేసింది? వంటి విషయాలు ఆయనకు తె లుసు. మద్యం స్కామ్‌లో వచ్చిన డబ్బుతో వాసుదేవరెడ్డి కూడా బాగా అక్రమ సంపాదన పోగేశారు. తన బంధువుల పేరిట భారీగా ఆస్తులు కూడబెట్టారు. ఈ కేసులో వెలుగుచూడని అసలు సూత్రధారులు, పాత్రధారులు ఎవరో కనిపెట్టేందుకు మరింత లోతైన విచారణ చేపట్టేందుకు కస్టోడియల్ విచారణ అవసరమని సిట్ పేర్కొంది. వాసుదేవరెడ్డి బయట ఉంటే అతి కీలకమైన ఆధారాలు చెరిపివేయగలరని కూడా సిట్ ఆరోపించింది. లిక్కర్ స్కామ్‌లో ఏ2 వాసుదేవరెడ్డి అరెస్ట్‌మద్యం కుంభకోణంలో రెండో నిందితుడిగా ఉన్న వాసుదేవరెడ్డికి విజయవాడ ఏసీబీ కోర్టు ఈ నెల 27వ తేదీ వరకు రిమాండ్ విధించింది. సిట్ అధికారులు శనివారం అరెస్టు చేసి, ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు. ప్రాసిక్యూషన్స్ తరపున జేడీ రాజేంద్రప్రసాద్ వాదనలు వినిపించారు. వాసుదేవరెడ్డి తరఫున హైకోర్టు న్యాయవాది కె.గోపీనాథ్ వాదించారు. వాదప్రతివాదనలు విన్న తర్వాత వాసుదేవరెడ్డికి 27 వరకు రిమాండ్ విధిస్తూ న్యాయాధికారి పి.భాస్కరరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఆయనను గుంటూరులోని జిల్లా జైలుకు తరలించాలని ఆదేశించారు. కాగా ప్రధాన నిందితుడు కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి అండ్ కోను అరెస్టు చేయడం మొదలుపెట్టిన తర్వాత తాను అప్రూవర్‌గా మారిపోతానంటూ ఏసీబీ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై కోర్టు అక్షింతలు వేసింది. ప్రభుత్వం మారిన తర్వాత వాసుదేవరెడ్డి కేంద్ర సర్వీసుకు వెళ్లిపోయారు. ప్రస్తుతం ఢిల్లీలో పనిచేస్తున్న ఆయనను సిట్ అధికారులు విచారణ నిమిత్తం పిలిపించారు.

## సుబ్రహ్మణ్యస్వామీ దేవస్థానంలో స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ



**కృష్ణా జిల్లా, మోపిదేవి:::: క్రైం కౌంటర్ న్యూస్ ప్రతినిధి:::** సుబ్రహ్మణ్యస్వామీ దేవస్థానంలో స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ మోపిదేవి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీవల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానములో, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆదేశాల మేరకు "స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ" కార్యక్రమం ఘనంగా నిర్వహించారు

ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ కమిషనర్ ఉ కార్యనిర్వాహణ అధికారి దాసరి శ్రీరామ వరప్రసాదరావు ఆలయ సిబ్బందికి స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించి, పరిసరాల పారి శుధ్యంపై, పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ పట్ల అందరూ కట్టుబడి ఉండాలని, స్వచ్ఛమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణంలో ప్రతి ఒక్కరు తమ వంతు పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించబడింది. సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని పరిసరాలను శుభ్రం చేశారు.

# ఏయూలో మళ్లీ రగడ

**విద్యార్థి సంఘాల ఆందోళనలు**
**స్వయంగా రంగంలోకి దిగిన పోలీస్ కమిషనర్**
**స్టూడెంట్ లీడర్లతో అధికారుల సమావేశం**
**నాన్ బోర్డర్లు క్యాంప్‌సలో ఉంటే చర్యలంటూ హెచ్చరిక**
**మార్చి 2 వరకూ ధర్నాలు, నిరసనలపై ఆంక్షలు**



**క్రైం కౌంటర్ న్యూస్,**విశాఖపట్నం, ఫిబ్రవరి 21: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో విద్యార్థి సంఘాల మధ్య మళ్లీ రగడ చోటు చేసుకుంది. ఎన్నడూ లేని విధంగా సంఘాలు పరస్పరం దాడులకు దిగుతున్నాయి. ఇది శాంతి భద్రతల సమస్యగా పరిణమించింది. ఏబీవీపీ విద్యార్థులు శనివారం వందల సంఖ్యలో క్యాంప్‌సలోకి ప్రవేశించి జెండాలు ఎగురవేసే స్తంభాలను విరిచేశారు. ఒకేసారి ఎక్కువ మంది రావడం, పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో స్వయంగా సిటీ పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి అక్కడకు చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. కొందరిని వ్యాన్లలో ఎక్కించి బయటకు తరలించారు. క్యాంప్‌సకు సంబంధం లేనివారు ఈ ఆందోళనలో పాల్గొన్నట్టు తేలితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆధారాలు సమర్పించండి...

ఈ ఘర్షణలకు ఫుల్‌స్టాప్ పెట్టాలని జిల్లా అధికార యంత్రాంగం శాంతి కమిటీని ఏర్పాటు చేసింది. ఏయూ వీసీ ప్రొఫెసర్ జీసీ రాజశేఖర్ అధ్యక్షతన రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.రాంబాబు, ఆర్‌డీఓ సుధాసాగర్, విశాఖ ఈస్ట్ ఏసీపీ లక్ష్మణమూర్తి కలిసి విద్యార్థి సంఘాల నాయకులతో శనివారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. రెండు గంటలసేపు సాగిన సమావేశంలో ఇరువర్గాల ఆరోపణలు, వాదనలు విన్నారు. వివాదానికి సంబంధించిన ఎవరి దగ్గర ఏయే ఆధారాలు ఉన్నాయో వీడియోలు, ఫొటోలు సోమవారం మధ్యాహ్నానికి సమర్పించాలని సూచించారు. వాటి ఆధారంగా మార్చి రెండో తేదీన మరోసారి సమావేశం నిర్వహించి, తుది నిర్ణయం వెల్లడిస్తామన్నారు. దీనికి అన్ని విద్యార్థి సంఘాలు కట్టుబడి ఉండాలని స్పష్టం చేశారు. అంతవరకు క్యాంప్‌సలో ధర్నాలు, నిరసన కార్యక్రమాలు నిర్వహించకూడదని ఆంక్షలు విధించారు. విద్యార్థులు కెరియర్‌పై దృష్టి సారించాలని, వివాదాల్లో తలదూర్చవద్దని సూచించారు. నాన్ బోర్డర్లకు క్యాంప్‌సలో స్థానం కల్పించవద్దని స్పష్టం చేశారు. అలా ఎవరైనా చేస్తే ఆ విద్యార్థులపైనా చర్యలు చేపడతామన్నారు.

గొడవకు కారణం ఇదీ....

ఏబీవీపీ విద్యార్థులు కొద్దిరోజుల క్రితం క్యాంప్‌సలోని బాస్కెట్‌బాల్ మైదానంలో ఆర్‌ఎ?సఎస్ శాఖ కార్యక్రమం నిర్వహించారు. ఈ విషయం తెలిసి ఎస్ఎ?ఫఐ, ఏఎ?సఎ?ఫఐ విద్యార్థి సంఘాల ప్రతినిధులు అక్కడకు వెళ్లి ఘర్షణ పడ్డారు. దాడి చేశారని ఏబీవీపీ ఆరోపిస్తోంది. దీనిపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ స్పందించారు. ఈ నేపథ్యంలో గత నాలుగు రోజులుగా క్యాంప్‌సలో ఆందోళనలు, ధర్నాలు జరుగుతున్నాయి. పోలీసులు సర్దిచెప్పి పంపుతున్నారు. తాజాగా శనివారం ఉదయం పెద్ద సంఖ్యలో ఏబీవీపీ ప్రతినిధులు వచ్చారు. పరిస్థితి చేయి దాటిపోయేటట్టు ఉందని పోలీసు కమిషనర్ స్వయంగా రంగంలోకి దిగారు.

# హైదరాబాద్‌లో యువతి.. భీమిలిలో సాఫ్ట్‌వేర్ కుర్రోడు

**క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 21:** విశాఖ జిల్లా భీమిలిలో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి లాడ్జిలో బలవన్మరణానికి పాల్పడిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. భీమిలి బీచ్‌లో ఉన్న ఓ ప్రైవేట్ లాడ్జిలో శుక్రవారం రోజున శ్యామ్‌కుమార్ అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. లాడ్జి సిబ్బంది సమాచారం ఇవ్వటంతో ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు.. చనిపోయిన వ్యక్తిది విశాఖలోని కోటవీధి అని గుర్తించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు.. దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

మరోవైపు కుటుంబసభ్యులు, పోలీసులు చెప్తున్న వివరాల ప్రకారం.. 26 ఏళ్ల శ్యామ్ కుమార్ హైదరాబాద్‌లో ఓ ఐటీ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేసేవారు. ఈ క్రమంలోనే ఓ యువతితో శ్యామ్ కుమార్‌కు పరిచయమైంది. ఈ పరిచయం కాస్తా ప్రేమకు దారి తీసినట్లు తెలుస్తోంది. అయితే ఈ మధ్యకాలంలో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో హైదరాబాద్‌లో ఆ యువతి ఆత్మహత్యకు యత్నించింది. ఈ విషయాన్ని గుర్తించిన ఆమె కుటుంబసభ్యులు వెంటనే తనను ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనకు సంబంధించి జీడిమెట్ల పోలీస్ స్టేషన్‌లో శ్యామ్ కుమార్ మీద పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో భయపడిపోయిన శ్యామ్ కుమార్.. రెండు రోజుల కిందట హైదరాబాద్ నుంచి భీమిలికి వచ్చేశాడు. అక్కడే లాడ్జిలో గది తీసుకుని ఉంటున్నాడు.

అయితే ఆత్మహత్యకు యత్నించి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువతి చనిపోయినట్లు స్నేహితుల ద్వారా శ్యామ్‌కుమార్‌కు తెలిసింది. దీంతో శుక్రవారం రోజున శ్యామ్ కుమార్ బలవన్మరణానికి పాల్పడ్డాడు. గదిలోకి వెళ్లిన శ్యామ్ కుమార్, ఎంతకూ బయటకు రాకపోవటంతో లాడ్జి సిబ్బందికి అనుమానం వచ్చింది. దీంతో అదనపు తాళంతో గది తెరిచి చూసేసరికి శ్యామ్ కుమార్ మృతదేహం కనిపించింది. దీంతో పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే అక్కడకు చేరుకున్న పోలీసులు.. శ్యామ్ కుమార్ కుటుంబసభ్యులకు సమాచారం అందించారు.

శ్యామ్ కుమార్ సోదరుడు ఇచి?్చన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. మరోవైపు లాడ్జి గదిలో పోలీసులు సూసైడ్ లెటర్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. అలాగే ఎలుకల మందు ప్యాకెట్లు,మద్యం సీసాను గుర్తించినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో మద్యంలో ఎలుకల మందు కలిపి తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు భావిస్తున్నారు.

# సినిమా



## ఆమె కూడా హీరోయిన్ గా చేసింది

డైరెక్టర్ మారుతి దర్శకత్వంలో వచ్చిన సినిమాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఆయన డైరెక్షన్ లో వచ్చిన సినిమాలు దాదాపు హిట్ గా నిలిచాయి. ఇటీవలే ఆయనప్రభాస్ హీరోగా పెట్టి రాజా సాబ్ అనే సినిమా చేశాడు. ఈ సినిమా మిక్స్ టాక్ సొంతం చేసుకుంది. ఇక మారుతి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ రోజుల్లో, బస్ స్టాప్, ప్రేమ కథ చిత్రం, భలేభలే మగాడివోయ్, మహానుభావుడు ఇలా చాలా సినిమాలు మంచి విజయాలను అందుకున్నాయి. ఇక ఇప్పుడు ప్రభాస్ తో సినిమా చేస్తున్నాడు మారుతి. ఇదిలా ఉంటే మారుతి సినిమాల్లో యూత్ ను ఎక్కువగా ఆకట్టుకున్న సినిమా బస్ స్టాప్. ప్రిన్స్, శ్రీదివ్య హీరో హీరోయిన్స్ గా నటించిన ఈ మూవీ సూపర్ హిట్ అయ్యింది.అందమైన ప్రేమకథతో పాటు ఆకట్టుకునే కామెడీ ఉంటుంది ఈ సినిమాలో.. అయితే ఈ సినిమా తర్వాత శ్రీదివ్య క్రేజీ హీరోయిన్ గా మారిపోయింది. తెలుగులో శ్రీదివ్యకు మంచి డిమాండ్ క్రియేట్ అయ్యింది. ఆ తర్వాత కేరింత సినిమాతో హిట్ అందుకుంది ఈ భామ. కానీ తెలుగు కంటే తమిళ్ లో శ్రీదివ్య ఎక్కువ ఆఫర్స్ అందుకుంది. కోలీవుడ్ లో ఈ అమ్మడు మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ సొంతం చేసుకుంది. కోలీవుడ్ లో శివ కార్తికేయన్, కార్తీ , విశాల్ వంటి స్టార్ హీరోల సినిమాల్లో నటించి పేరు తెచ్చుకుంది.శ్రీ దివ్య చైల్డ్ ఆర్టిస్ట్ గా పలు సినిమాలు చేసింది. ఆతర్వాత హీరోయిన్ గా మారిపోయింది. మనసారా సినిమాతో హీరోయిన్ గా పరిచయం అయ్యింది ఈ ముద్దుగుమ్మ. ఆతర్వాత బస్ స్టాప్, మల్లెలతీరంలో సిరిమల్లెపువ్వు, కేరింత సినిమాలు చేసింది. అయితే ఎక్కువగా ఈ అమ్మడు తమిళ్ లోనే సినిమాలు చేసింది. అయితే శ్రీదివ్య మాత్రమే కాదు ఆమె అక్క కూడా హీరోయిన్ అన్న విషయం మీకు తెలుసా.? అవును ఆమె కూడా ఓ క్రేజీ హీరోయిన్. టాలీవుడ్ లో పలు సినిమాలు చేసి ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఆమె పేరు శ్రీ రమ్య. ఈ అమ్మడు కూడా చాలా అందంగా ఉంటుంది. 2008లో వచ్చిన 1940లో ఒక గ్రామం అనే సినిమాలో నటించింది ఈ బ్యూటీ. ఆ సినిమాతో నంది అవార్డు సైతం గెలుచుకుంది. ఆతర్వాత శ్రీకాంత్‌తో విరోధి, అలియాస్ జానకి వంటి సినిమాలు చేసింది. అలాగే తమిళ్ లోనూ ఓ సినిమా చేసింది శ్రీ రమ్య. కానీ ప్రస్తుతం సినిమాల్లో ఎక్కువ కనిపించడం లేదు ఈ అమ్మడు.





## ఆ సమస్యలకు రామబాణం..

కివి పండులో ఔషధ గుణాలతోపాటు.. పోషకాలు పుష్కలంగా దాగున్నాయి.. కివిలో విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు, ఫైబర్‌తో సమృద్ధిగా ఉంటుంది. అందుకే.. కివి పండును సూపర్ ఫుడ్‌గా పరిగణిస్తారు. ముఖ్యంగా, శరీరానికి అవసరమైన విటమిన్-సి కివిలో అధికంగా లభిస్తుంది. దీని గుజ్జులో ఉండే చిన్న నల్లటి విత్తనాలలో ఒమేగా-3 ఫ్యాటీ ఆసిడ్లు కూడా ఉంటాయి.. ఇవన్నీ మొత్తం ఆరోగ్యానికి చాలా మేలు చేస్తాయి.

శక్తివంతమైన కివి పండులో ఇందులో విటమిన్ సి (నారింజ కంటే ఎక్కువ), విటమిన్ కె, విటమిన్ ఇ, ఫైబర్, పొటాషియం, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి ఎన్నో సమస్యలకు అమృతఫలంగా పేర్కొంటారు.

కివి పండు ప్రయోజనాలు..

వ్యాధి నిరోధక శక్తిని మెరుగుపరుస్తుంది: ప్రస్తుత కాలంలో వ్యాధి నిరోధక శక్తిని పెంచుకోవడం చాలా అవసరం. కివి పండులో విటమిన్-సి, యాంటీఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేస్తాయి. రోజువారీ శరీరానికి అవసరమయ్యే విటమిన్-సి మొత్తాన్ని ఒక కివి పండు అందిస్తుంది.

గుండె ఆరోగ్యం: కివి పండు గుండె ఆరోగ్యానికి చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. ఇది రక్తపోటును తగ్గించడంలో సహాయపడుతుంది.. తద్వారా గుండెపోటు, ఇతర గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. క్రమం తప్పకుండా 2-3 కివి పండ్లను తీసుకోవడం వల్ల రక్తం గడ్డకట్టడాన్ని నివారించవచ్చు. ఆస్పిరిన్ టాబ్లెట్ తరహాలో ఇది గుండెకు రక్షణ కల్పిస్తుంది.

ఆస్తమా - అలర్జీల నివారణ: శీతాకాలం సహా.. సీజన్ మారినప్పుడల్లా.. ఆస్తమా, అలర్జీలు ఇబ్బంది పెడుతుంటాయి. కివిలో ఉండే విటమిన్-సి, యాంటీఆక్సిడెంట్లు ఆస్తమా రోగులకు ఉపశమనం కలిగిస్తాయి. గురక, శ్వాస ఆడకపోవడం వంటి లక్షణాలను తగ్గిస్తాయి.

జీర్ణక్రియ మెరుగుదల: మంచి ఆరోగ్యం కోసం జీర్ణక్రియ సక్రమంగా ఉండటం అత్యవసరం. కివి పండులో డైటరీ ఫైబర్‌తో పాటు, ఆక్టినిడిన్ అనే ఎంజైమ్ ఉ ంటుంది.. ఇది జీర్ణవ్యవస్థకు చాలా మేలు చేస్తుంది. ఆరోగ్యకరమైన జీర్ణక్రియ కోసం కివిని ఆహారంలో చేర్చుకోవాలి.

కంటి చూపు మెరుగుదల: నేటి కాలంలో చిన్నపిల్లల్లో కూడా కంటి సమస్యలు పెరుగుతున్నాయి. కివి పండులో జియాజాంతిన్, లుటిన్ అనే రెండు కాంపౌండ్లు ఉ ంటాయి. లుటిన్‌ను "ఐ విటమిన్" అని కూడా అంటారు. ఈ రెండు కంటి ఆరోగ్యానికి చాలా మంచివి.. కంటి సంబంధిత వ్యాధులు, క్యాటరాక్ట్‌లు రాకుండా రక్షిస్తాయి. రెటీనా దెబ్బతినకుండా కాపాడుతూ, అధిక కాంతి నుండి కళ్లను రక్షించడంలో సహాయపడతాయి.

చర్మ ఆరోగ్యం: కివి చర్మ ఆరోగ్యానికి కూడా చాలా ఉపయోగపడుతుంది. దీనిలో ఉండే కొల్లాజెన్ ఫైన్ లైన్స్, స్మైల్ లైన్స్ వంటి వృద్ధాప్య లక్షణాలను తగ్గించడంలో సహాయపడుతుంది. కివి పండు గుజ్జును అలోవెరాతో కలిపి రాత్రిపూట ముఖానికి రాసి ఉదయం కడిగేస్తే మొటిమల సమస్య కూడా తగ్గుతుందని పేర్కొంటున్నారు ఆరోగ్య నిపుణులు..

బరువు తగ్గడం: బరువు తగ్గాలనుకునే వారికి కివి పండు చాలా సహాయకారిగా ఉ ంటుంది. దీనిలో అధిక నీటి శాతం, తక్కువ కేలరీలు, అధిక ఫైబర్ ఉంటాయి. ఈ లక్షణాలు బరువు తగ్గడానికి దోహదపడతాయి.. అదే సమయంలో శరీరానికి అవసరమైన పోషకాలను అందిస్తాయి.

మంచి నిద్ర: నిద్రలేమితో (ఇన్సోమ్నియా) బాధపడేవారు తమ ఆహారంలో కివి పండును చేర్చుకోవడం వల్ల మంచి నిద్ర పడుతుందని 2011లో జరిగిన ఒక పరిశోధనలో తేలింది.

ఇతర ప్రయోజనాలు:

కివిలో విటమిన్-సి తో పాటు ఐరన్ కూడా ఉంటుంది కాబట్టి, ఐరన్ లోపం (అనీమియా) ఉన్నవారికి ఇది చాలా ప్రయోజనకారి. కివిని బనానాతో కలిపి తీసుకుంటే అనీమియాను అధిగమించవచ్చు.

ఆహారంలో కివి వినియోగం:

అల్పాహారాన్ని దాటవేయడం మంచిది కాదు. తినడానికి ఆసక్తి లేనప్పుడు, కివిని సలాడ్‌గా, స్మూతీగా లేదా స్నాక్‌గా తీసుకోవచ్చు. కివి, దోసకాయ, కొద్దిగా అల్లం కలిపి చేసుకునే జ్యూస్ వ్యాధి నిరోధక శక్తిని పెంచడంతో పాటు, బరువు తగ్గడానికి, శరీరాన్ని డీటాక్సిఫై చేయడానికి సహాయపడుతుంది. వేసవిలో ఈ జ్యూస్ డీహైడ్రేషన్ నుండి కూడా రక్షిస్తుంది.

కివి పండు ప్రస్తుతం అన్నిచోట్లా సులభంగా లభిస్తుంది. దీని అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాల దృష్ట్యా, మీ రోజువారీ ఆహారంలో కివిని చేర్చుకోవడం ఆరోగ్యకరమైన జీవితానికి ఒక మంచి అడుగు అవుతుందని.. ఆరోగ్య నిపుణులు పేర్కొంటున్నారు. ఇది కేవలం అవగాహన కోసం మాత్రమే.. ఏమైనా సమస్యలతో బాధపడుతుంటే.. ఆరోగ్య నిపుణులను సంప్రదించడం మంచిది.




## అభిషేక్ మళ్ళీ పుంజుకుంటాడా?

టీ20 వరల్డ్ కప్ 2026లో అసలైన వేట మొదలైంది. లీగ్ దశలో ఆడిన అన్ని మ్యాచ్‌ల్లోనూ విజయకేతనం ఎగురవేసిన టీమిండియా, ఇప్పుడు సూపర్-8 రౌండ్‌లో తన సత్తా చాటడానికి సిద్ధమైంది. ఆదివారం నాడు అహ్మదాబాద్ వేదికగా గత ప్రపంచకప్ రన్నరప్ సౌతాఫ్రికాతో భారత్ తన మొదటి సూపర్-8 మ్యాచ్ ఆడనుంది. అయితే ఈ మ్యాచ్‌కు ముందు అందరి దృష్టి, అందరి చర్చా ఒక్కరి గురించే.. ఆయనే యువ ఓపెనర్ అభిషేక్ శర్మ. లీగ్ దశలో వరుసగా మూడు మ్యాచ్‌ల్లో డకౌట్ (సున్నా పరుగులు) అయి నిరాశపరిచిన అభిషేక్ ఫామ్ ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.

అభిషేక్ శర్మ వరుసగా విఫలమవుతుండటంతో అభిమానులు, విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కానీ టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ మాత్రం చాలా కూల్‌గా ఉన్నాడు. మ్యాచ్‌కు ముందు జరిగిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో సూర్య చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. "అభిషేక్ ఫామ్ గురించి ఆందోళన పడుతున్న వారిని చూస్తేనే నాకు జాలేస్తోంది. నాకు అభిషేక్ గురించి భయం లేదు, కానీ అతడిని ఎదుర్కోబోయే ప్రత్యర్థి జట్ల గురించి మాత్రం చాలా టెన్షన్ గా ఉంది. గత ఏడాది కాలంగా అభిషేక్ జట్టు కోసం ఎంతో చేశాడు, ఇప్పుడు అతనిపై నమ్మకం ఉంచి ఆ బాకీ తీర్చుకోవాల్సిన బాధ్యత మాపై ఉంది" అని సూర్య గంభీరంగా సమాధానమిచ్చాడు.

ఈ వరల్డ్ కప్ ప్రారంభానికి ముందు అభిషేక్ శర్మను భారత బ్యాటింగ్ వెన్నెముకగా భావించారు. కానీ టోర్నీ మొదలైనప్పటి నుంచి అతడిని దురదృష్టం వెంటాడుతోంది. మొదటి మ్యాచ్‌లోనే సున్నాకే వెనుదిరగడమే కాకుండా, ఆ తర్వాత తీవ్ర అనారోగ్యం పాలై రెండు రోజుల పాటు ఆసుపత్రిలో కూడా ఉండాల్సి వచ్చింది. కోలుకుని జట్టులోకి వచ్చినా తర్వాతి రెండు మ్యాచ్‌ల్లోనూ ఖాతా తెరవలేకపోయాడు. ఒకే నెలలో ఆడిన ఎనిమిది టీ20 మ్యాచ్‌ల్లో ఐదు సార్లు సున్నాకే అవుట్ కావడం ఎవరికైనా ఆందోళన కలిగించే విషయమే. కానీ కెప్టెన్ సూర్య మాత్రం అభిషేక్ ఒకే ఒక్క ఇన్నింగ్స్‌తో అన్ని విమర్శలకు చెక్ పెడతాడని నమ్ముతున్నాడు.

లీగ్ దశలో పసికూనలపై గెలిచినంత సులభంగా సూపర్-8 ఉండదు. ఇక్కడ సౌతాఫ్రికా వంటి బలమైన జట్టుతో తలపడాల్సి ఉంది. ఒకవేళ సౌతాఫ్రికాతో జరిగే కీలక మ్యాచ్‌లో కూడా అభిషేక్ త్వరగా అవుట్ అయితే మాత్రం టీమిండియా చిక్కుల్లో పడటం ఖాయం. మీడియా ముందు కెప్టెన్ ఎంత ధైర్యంగా మాట్లాడినా, తెర వెనుక మాత్రం ఒత్తిడి ఉందనేది వాస్తవం. అభిషేక్ తన విధ్వంసకర బ్యాటింగ్‌తో మళ్ళీ ఫామ్‌లోకి వస్తాడా? లేక సూర్య నమ్మకాన్ని వమ్ము చేస్తాడా? అనేది ఆదివారం తేలిపోనుంది.



## 10 ఏళ్ల తర్వాత అద్భుతం..

ఆస్ట్రేలియా గడ్డపై భారత మహిళా క్రికెట్ జట్టు సరికొత్త చరిత్ర సృష్టించింది. దశాబ్ద కాలంగా ఊరిస్తున్న నిరీక్షణకు తెరదించుతూ.. కంగారూ కోటలో టీమిండియా జయభేరి మోగించింది. హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని భారత జట్టు, ఆస్ట్రేలియాతో జరిగిన నిర్ణయాత్మకమైన మూడో టీ20 మ్యాచ్‌లో 17 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. దీంతో మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను భారత్ 2-1తో కైవసం చేసుకుంది. 2016 తర్వాత ఆస్ట్రేలియాపై భారత్ టీ20 సిరీస్ గెలవడం ఇదే తొలిసారి. అడిలైడ్‌లో జరిగిన ఈ పోరులో స్మృతి మంధాన తన బ్యాటింగ్‌తో చెలరేగగా, యువ స్పిన్నర్ శ్రేయాంక పాటిల్ తన బౌలింగ్‌తో ప్రత్యర్థిని ఉక్కిరిబిక్కిరి చేసింది.

శనివారం (ఫిబ్రవరి 21) జరిగిన ఈ కీలక మ్యాచ్‌లో టాస్ గెలిచిన భారత్ మొదట బ్యాటింగ్‌కు దిగింది. ఓపెనర్ షెఫాలీ వర్మ త్వరగానే అవుట్ అయినా, వైస్ కెప్టెన్ స్మృతి మంధాన, జెమిమా రోడ్రిగ్స్ ఇన్నింగ్స్‌ను అద్భుతంగా నిర్మించారు. వీరిద్దరూ రెండో వికెట్‌కు ఏకంగా 121 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. మంధాన కేవలం 55 బంతుల్లో 82 పరుగులు చేయగా, జెమిమా 59 పరుగులతో రాణించింది. వీరిద్దరి వీరవిహారంతో భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 176 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఆస్ట్రేలియా బౌలర్లలో అనాబెల్ సదర్లాండ్ రెండు వికెట్లు పడగొట్టింది. 177 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఆస్ట్రేలియాకు ఆరంభం అదిరిపోయింది. మొదటి ఓవర్లోనే 18 పరుగులు పిండుకోవడంతో మ్యాచ్ వారి చేతుల్లోకి వెళ్లేలా కనిపించింది. అయితే రెండో ఓవర్లోనే సీన్ మారింది. యువ సంచలనం శ్రేయాంక పాటిల్ తన స్పిన్ మాయాజాలంతో ఆస్ట్రేలియా ఓపెనర్లను కట్టడి చేసింది. చూస్తుండగానే 32 పరుగులకే 3 కీలక వికెట్లు కోల్పోయి ఆసిస్ కష్టాల్లో పడింది. ఆష్లీ గార్డనర్ (57) ఒంటరి పోరాటం చేసినా, ఇతర బ్యాటర్ల నుంచి సహకారం లభించలేదు. శ్రేయాంక పాటిల్ (3/22), శ్రీ చరణి (3/32) ధాటికి ఆస్ట్రేలియా 159 పరుగులకే పరిమితమైంది. దీంతో భారత్ చారిత్రాత్మక విజయాన్ని అందుకుంది.

ఈ విజయంతో కేవలం సిరీస్ మాత్రమే కాదు, మల్టీ ఫార్మాట్ సిరీస్‌లో కూడా భారత్ 4-2 ఆధిక్యంలోకి వెళ్ళింది. 2017 తర్వాత ఆస్ట్రేలియా తన సొంత గడ్డపై ఏ ఫార్మాట్‌లోనూ సిరీస్ ఓడిపోలేదు. అలాంటి రికార్డును భారత్ ఇప్పుడు బద్దలు కొట్టింది. 10 ఏళ్ల తర్వాత ఆసిస్ గడ్డపై టీ20 సిరీస్ గెలవడం అంటే అది మామూలు విషయం కాదు. ఈ జోష్‌తోనే భారత జట్టు త్వరలో జరగనున్న వన్డే, టెస్ట్ మ్యాచ్‌లకు సిద్ధమవుతోంది. వచ్చే మహిళా టీ20 వరల్డ్ కప్ 2026కు ఈ గెలుపు ఒక గొప్ప ఆత్మవిశ్వాసాన్ని ఇస్తుందని క్రికెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.



Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006. Published by Katikala Vara Prasad. at H No: 21-119, West Ibrahimpatnam, Krishna, Andhra Pradesh - 521456. . Editor. Katikala Vara Prasad. RNI- 2015/62250, Reg No: APTEL/25/A2844. Ph:9849707349 email:kvp6858@gmail.com